క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న మే పుష్పం



నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని పెద్ద పార్కులో ఆదివారం మే పుష్పం వికసించింది. పార్కులోకి వచ్చే వారందరూ దానిని చూసి ముచ్చటపడుతున్నారు. ఏడాదిలో ఎండలు ఎక్కువ ఉండే మే నెలలోనే ఈ పుష్పం వికసించడంతో దీనికి మే పుష్పం అని పేరు వచ్చింది. పలువురు తమ సెల్‌ఫోన్లలో బంధిస్తున్నారు.

డ్రెయినేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలు



నూజివీడు: డ్రెయినేజీల్లో చెత్తాచెదారం పేరుకుపోతున్నా మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. పట్టణంలోని గాంధీనగర్ డ్రెయినేజీలో చెత్తాచెదారం అడ్డుపడి మురుగునీరు ప్రవహించక నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. 26వ వార్డులో డ్రెయినేజీల్లో ఉన్న చెత్తాచెదారమే ఇందుకు నిదర్శనంగా దర్శనమిస్తోంది. పారిశుద్ధ్య సిబ్బందితో పని చేయించడంలో మున్సిపల్ అధికారులు ఘోరంగా విఫలమవుతున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆదివారం వస్తే పారిశుద్ధ్యం మరింత అధ్వానంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి



ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో విద్యుత్ సబ్ స్టేషన్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఈ రోడ్డులోని గుంతల్లో వర్షం నీరు నిలిచిపోవడంతో ప్రజల అవస్థలు వర్ణనాతీతం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వర్షం నీటితో ఇక్కట్లు



ఆగిరిపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలతో శోభనాచలుని కొండపై నుంచి వస్తున్న వర్షం నీటితో కొండ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. శోభనాచలుని కొండపై కొన్ని నెలల కిందట ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అధికారులు సరైన చర్యలు చేపట్టకపోవడంతో కొండపై నుంచి వచ్చే వర్షం నీరు నేరుగా దిగువన ఉన్న కాలనీవాసుల ఇళ్లల్లోకి చేరుకుంటోంది. దీంతో కొండ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడు మోకాలి లోతు వరకు నీళ్లు ఇళ్లల్లోకి చేరుకుంటున్నాయని, దీంతో వంట చేసుకోవడానికి, పడుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వర్షాకాలంలో మా పరిస్థితి ఏమిటని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కొండపై నుంచి వస్తున్న వర్షం నీరు ఇళ్లల్లోకి రాకుండా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

నందిగామరూరల్: యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవనంలో నిత్యకృత్యం చేసుకోవాలని ఆర్డీవో బాలకృష్ణ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంప్లాయిస్ థీమ్‌లో భాగంగా ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం యోగా కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. ఒత్తిడి, ఆందోళనతో పాటు నిత్య జీవితంలో ఎదుర్కొనే అనారోగ్య సమస్యలకు యోగాతో పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం యోగా గురువు సంగెపు సుధాకర్ ఆర్డీవో, సిబ్బందితో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు ఏవీ?

- జూన్ వస్తున్నా వ్యవసాయ కార్యాలయాలకు చేరని పచ్చిరొట్ట విత్తనాలు
- వర్షాలు పడుతున్న నేపథ్యంలో విత్తనాల కోసం ఎదురుచూపులు



భూమిలో కలియ దున్నడానికి సిద్ధంగా ఉన్న జీలుగ (ఫైల్)

జి.కొండూరు: భూసారం పెంచేందుకు వినియోగించే పచ్చిరొట్ట విత్తనాలు ఇప్పటివరకు వ్యవసాయ కార్యాలయాలకు చేరుకోలేదు. వర్షాలు కురుస్తున్నందున విత్తనాలు అందుబాటులో ఉంటే వెదజల్లి సాగు పనులు ప్రారంభించేవారు. సేంద్రియ వ్యవసాయంలో భాగమైన పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో జాప్యం జరుగుతుండడంతో రైతులు విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు.

ప్రతి ఏటా ఇలా..

ప్రతి ఏటా మే 15 కల్లా వ్యవసాయ శాఖ కార్యాలయాలకు పచ్చిరొట్ట విత్తనాలు చేరేవి. విత్తనాలను మే చివరికల్లా రైతులకు పంపిణీ చేస్తే తొలకరి జల్లులు పడగానే దుక్కులు దున్నుకొని విత్తనాలను వెదజల్లేవారు. జూన్ నెల ఆరంభం నుంచి వరి విత్తనాలను పంపిణీ చేస్తుంటారు. అయితే ఈ ఏడాది జూన్ నెల వస్తున్నప్పటికీ పచ్చిరొట్ట విత్తనాలు వ్యవసాయ శాఖ కార్యాలయాలకు చేరలేదు. ఈ సంవత్సరం ముందుగానే వర్షాలు పడుతున్న నేపథ్యంలో గత ఏడాది జరిగిన నష్టాన్ని పూడ్చుకునేందుకు రైతులు ముందుగా సాగు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అయితే పచ్చిరొట్ట విత్తనాలు ఇంకా రాలేదు.

ఆలస్యమైతే ప్రయోజనం ఉండదు..

పచ్చిరొట్ట విత్తనాలను ఆలస్యంగా పంపిణీ చేయడం వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండదు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర, జనుము పంటలను పూత దశ వచ్చే వరకు పెంచి భూమిలో కలియదున్నాల్సి ఉంటుంది. అలా చేస్తేనే భూమికి అవసరమైన నత్రజని, సేంద్రియ కర్బనం అందుతుంది. విత్తనాలను ఆలస్యంగా పంపిణీ చేయడం వల్ల వరినాట్లు వేసే సమయానికి పచ్చిరొట్ట పూత దశకు రాక భూమిలో కలియదున్నినా ప్రయోజనం ఉండదు. కనుక ప్రభుత్వం వెంటనే విత్తనాలను పంపిణీ చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

మైలవరం నియోజకవర్గంలో పంపిణీ చేయవలసిన పచ్చిరొట్ట విత్తనాల వివరాలు క్వింటాళ్లలో

మండలం	జీలుగ	పిల్లిపెసర	జనుము	మిక్కుడు
మైలవరం	240	100	15	05
జి.కొండూరు	280	100	10	05
రెడ్డిగూడెం	40	100	34	05
ఇబ్రహీం పట్నం	150	50	02	05
విజయవాడ రూరల్	164	25	05	05

పంపిణీ ఇలా..

పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు రాయితీపై తక్కువ ధరకు అందిస్తారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎకరానికి జీలుగ 10 కిలోలు, పిల్లిపెసర 8 కిలోలు, జనుము 10 కిలోల చొప్పున ఒక్కొక్క రైతుకు పాసు పుస్తకాల ఆధారంగా ఐదు ఎకరాల వరకు అందజేస్తారు. మైలవరం నియోజకవర్గంలో గత ఏడాది 14,898 హెక్టార్లలో వరి పంటను సాగు చేయగా బుడమేరు, చెరువుల గండ్లను పూడ్చి ప్రభుత్వం భరోసా ఇస్తే ఈ ఏడాది కూడా అదే స్థాయిలో సాగు చేసే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 1,340 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మొదటి విడతగా పంపిణీ చేయాల్సిందిగా కేటాయింపులు చేశారు. అయితే విత్తనాలు మాత్రం వ్యవసాయశాఖ కార్యాలయాలకు చేరలేదు.

వెంటనే పంపిణీ చేయాలి



ఇప్పటికే వర్షాలు పడుతున్నాయి. జూన్ నెల వస్తున్నప్పటికీ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయకపోతే విత్తనాలు చల్లేదెప్పుడు, పైరు పెరిగి భూమిలో కలియదున్నేదెప్పుడు. ప్రభుత్వం వెంటనే విత్తనాలను అందించాలి.

– పామర్తి అప్పారావు, రైతు, కుంటముక్కల గ్రామం

రెండు రోజుల్లో అందుబాటులోకి



పచ్చిరొట్ట విత్తనాలు రెండు రోజుల్లో అందుబాటులోకి వస్తాయి. రైతులకు ఇబ్బంది లేకుండా త్వరితగతిన పంపిణీ చేస్తాం. జనుము అందుబాటులో ఉంది. రైతులకు కావాలంటే జనుము విత్తనాలను వెంటనే తెప్పించి ఇస్తాం. పచ్చిరొట్ట విత్తనాలు రాగానే రైతులకు సమాచారం అందిస్తాం.

– రాంకుమార్, వ్యవసాయాధికారి, జి.కొండూరు మండలం

గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం

సీఐ చంద్రశేఖర్



ఇబ్రహీంపట్నం: గూడ్స్ వాహనాల్లో ప్రయాణాలతో ప్రమాదాలు పొంచి ఉంటాయని సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్లు, ఆటోలు, లారీల్లో వివిధ ఆలయాలకు వెళ్లి తిరిగి వస్తున్న వారిని నిలుపుదల చేశారు. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండటం వలన ప్రమాదం జరిగితే తీవ్రమైన నష్టం చోటుచేసుకుంటుందని హెచ్చరించారు. మరోసారి గూడ్స్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే భారీగా జరిమానా విధిస్తామన్నారు. మొదటిసారిగా నామమాత్రపు పెనాల్టీ విధించి వాహనాలను విడిచిపెట్టారు. ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలు స్వీకరించి గడువులోగా పరిష్కారాన్ని చూపుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని డివిజన్‌లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీసీలపై అక్రమ కేసులు.. వైఎస్సార్ సీపీ నిరసన



ఇబ్రహీంపట్నంలో నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం: బీసీ సామాజిక వర్గాలపై కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులు నిలిపి వేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారు. పల్నాడు జిల్లా దాచేపల్లిలో బీసీ యువకుడు ఉప్పతల హరికృష్ణపై పోలీసులు పెట్టిన అక్రమ కేసుకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ బీసీ విభాగం ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నల్లబ్యాడ్జీలు ధరించి, నల్లజెండాలు ప్రదర్శించారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి వేముల బేబీరాణి, బీసీ జిల్లా విభాగం అధ్యక్షుడు మార్తా శ్రీను, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బీసీలపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు. పోలీసులు ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు కూడా తెలియకుండా హరికృష్ణను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి చిత్రహింసలకు గురిచేయడం దారుణమన్నారు. కాలం ఎప్పుడూ ఒకేలాగ ఉండదని, రానున్న కాలంలో ఇంతకు పదిరెట్లు చర్యలు తప్పవని హెచ్చరించారు. బీసీ విభాగం నియోజకర్గ అధ్యక్షుడు కుంచం జయరాజు, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు పచ్చిగోళ్ల పండు, ప్రధాన కార్యదర్శి మిక్కిలి శరభయ్య, మండల కన్వీనర్ రెంటపల్లి నాగరాజు, వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, వివిధ విభాగాల నాయకులు కోమటి కోటేశ్వరరావు, కోలకాని శ్రీనివాస్, రాజేష్, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న శిక్షణ శిబిరాలు



మైలవరంలో అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయిని సైదాబి

మైలవరం: మనం మాట్లాడేటప్పుడు, రాసేటప్పుడు కొన్ని పదాలను ఉపయోగిస్తామని, ఆ పదాల కలయికే వాక్యం అవుతుందని మైలవరం లీలావతి హైస్కూల్ ఉపాధ్యాయిని ఎస్‌కే సైదాబీ అన్నారు. మైలవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు భాషా భాగాలను వివరించారు. ప్రతి పదానికి అది చేసే పనిని బట్టి వాక్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. అందుకే ప్రతి పదం భాషా భాగం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులలో భాగంగా ఆదివారం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. నీతి కథలు చెప్పించారు. చేతిరాతలో నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఐస్‌క్రీమ్ పుల్లలతో వాల్ హ్యాంగింగ్స్ ఎలా తయారు చేయాలో నేర్పించారు. హైస్కూల్ విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ నిర్వాహకురాలు జె. శ్రీలత పర్యవేక్షించారు.

మ్యూజికల్ చైర్స్ పోటీలు..

తిరువూరు: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, నీతి కథలు చెప్పించడంతో పాటు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. విద్యార్థులతో గ్రీటింగ్ కార్డులు తయారు చేయించారు. గ్రంథాలయాల ఉపయోగాలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. తిరువూరు గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు.

ప్రమాదకరంగా వంతెనలు

పట్టించుకోని అధికారులు



చంద్రాల సమీపంలో శిథిలావస్థలో నూజివీడు రోడ్డులో సాగర్ కాలువపై ఏర్పాటు చేసిన రక్షణ గోడలు



రక్షణ గోడలు లేని గుర్రాజుపాలెం రహదారిలోని వంతెన

మైలవరం: మైలవరం మండలంలో వాగులపై నిర్మించిన పలు వంతెనలు, చప్టాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. మైలవరం మండలం చంద్రాల శివారులో నూజివీడు రోడ్డులో కాలువపై కట్టిన వంతెనకు ఇరువైపులా రెయిలింగ్ కూలిపోయింది. మండలంలోని పుల్లూరు, చిలుకూరివారిగూడెం గ్రామాలకు వెళ్లే దారిలో వాగులపై ఏర్పాటు చేసిన చప్టాలు వర్షాకాలంలో వరద నీటిలో మునిగి గ్రామస్తుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. జి.కొండూరు మండలం గుర్రాజుపాలెం గ్రామానికి వెళ్లే రహదారిలో వాగుపై నిర్మించిన వంతెన ఇరువైపుల రక్షణ గోడలు లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గుర్రాజుపాలెం గ్రామానికి చెందిన వారు ఎక్కువగా వ్యాపారస్తులు ఉన్నారు. వీరంతా పగలు వ్యాపారాలు చేసుకుని రాత్రి వేళల్లో ఇళ్లకు చేరుతుంటారు. వంతెనకు రక్షణ గోడలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ వీటిపై దృష్టి సారించి వంతెనలు, వాగులపై చప్టాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నమ్మండి.. సీసీ రోడ్లేనండి!



వెల్లటూరు శివారు గ్రామం భీమవరప్పాడులో చర్చి రోడ్డు, పాఠశాలకు వెళ్లే రోడ్లు బురద మడుగుల్లా మారాయి. ఈ రెండు రోడ్లు సీసీ రోడ్లే అయినప్పటికీ డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం, మురుగునీరు పోయే దిశలో ఈ రోడ్లకి చివరలో అడ్డంగా ఎత్తుగా మరో సీసీ రోడ్డును ఇటీవల నిర్మించడంతో సమస్య తలెత్తింది. ఈ రెండు వీధుల్లో నివాసం ఉంటున్న కుటుంబాలు బురద మడుగుల్లో నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. అధికారులు వెంటనే స్పందించి మురుగునీరు పోయే మార్గం చూపకపోతే తాము ఇళ్లల్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి కూడా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–జి.కొండూరు





భీమవరప్పాడు గ్రామంలో బురద మడుగుల్లా మారిన సీసీ రోడ్లు

ప్రమాదకరంగా గుంత



నూజివీడు–గంపలగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిపై గొడుగువారిగూడెం వద్ద పడిన గుంత

నూజివీడు: పట్టణంలోని గొడుగువారిగూడెం వద్ద నూజివీడు–గంపలగూడెం ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో నిత్యం కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, ద్విచక్ర వాహనాలపై ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే భారీ వాహనాల లైటింగ్‌లో ఈ గుంత దగ్గరకు వచ్చే వరకు కనిపించక వాహన చోదకులు ప్రమాదం అంచువరకు వెళ్లి ఆగుతున్నారు. అగాధంలా పడిన గుంతను పూడ్చకుండా వదిలి వేయడంపై ఆర్‌అండ్‌బీ అధికారులపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఒకరి ప్రాణాలు పోయే వరకు స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఈ గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



ముసునూరు: ముసునూరు జెడ్పీ హైస్కూల్లో 2002–2003 విద్యాసంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థి మానికల గంగాధరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులంతా కలుసుకుని నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ సందడి చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో చీలి ఏలియా, వేల్పుల బాలాజీ, తలకొండ కాసులు, నక్కా యోహాను, తోట వడ్డీకాసులు, చెన్ను ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

- పెనుగంచిప్రోలు: తిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పల్నాడు జిల్లా నిడుముక్కల గ్రామానికి చెందిన గడ్డిపాటి పద్మావతి కుటుంబ సభ్యులు రూ.15 వేలను ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ బెజవాడ శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.